వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ వైభవం

- పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శనం
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అర్చకులు

బంజారాహిల్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం సూర్య వాహనంలో కొలువుదీరిన ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించి మంత్రోచ్చరణల మధ్య ఉత్తర ద్వారం తెరిచారు. ఈ ద్వారం గుండా దర్శనం చేసుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుమారు లక్ష మందికి పైగా ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని టీటీడీ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మంత్రోచ్చరణల మధ్య ఉత్తర ద్వారం తెరిచారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉంది. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి (స్వర్ణ) దేవాలయంలో రాధాగోవింద్‌లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వార దర్శనానికి అనుమతిచ్చారు.


ఎస్ఆర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని


బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ నేత కేకే, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మి బాల్ రెడ్డి


రాధాకృష్ణుల విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు


శ్రీనగర్‌కాలనీలో శ్రీవారి ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి


దైవసన్నిధానంలో పూజాధికాలకు హాజరైన సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ తదితరులు


హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1/12 చౌరస్తాలో స్వామివారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బాబా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

బోరబండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బోరబండ సైట్-2 కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేయాలని అధికారులకుసూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, వార్డు అధికారి విశ్వపతి, సూపర్‌వైజర్‌లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.


కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అందజేత

యూసుఫ్‌గూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమాలానగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఇళ్ల తాళాలు అందించారు. దీంతో ఎంతోకాలం నుంచి ఇళ్ల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు ఆనందంతో పొంగిపోయారు. వారంతా శాలువాలు, పూలబొకేలతో కార్పొరేటర్‌ను సన్మానించారు.


మాట్లాడుతున్న బీవీఆర్ మోహన్‌రెడ్డి

'సాంకేతిక అభివృద్ధి-అసెస్‌మెంట్'పై హెచ్‌సీయూలో సింపోజియం

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సాంకేతిక అభివృద్ధి-అసెస్‌మెంట్ అంశంపై శుక్రవారం సింపోజియం నిర్వహించారు. విద్యాసంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, సామాజిక వేత్తల సమ్మేళనానికి ఈ సింపోజియం వేదికైంది. సాంకేతికత బదిలీ, అభివృద్ధిలో తాజా పురోగతులు, ఉత్తమ పద్ధతులపై నిపుణులు చర్చించారు. విభిన్న రంగాలకు చెందిన ప్రఖ్యాత నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు. సింపోజియంలో ఐటీ పరిశ్రమకు చెందిన బీవీఆర్ మోహన్ రెడ్డి, వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ బీజేరావు, బిట్స్ పిలానీ వీసీ ప్రొఫెసర్ రాంగోపాల్ రావు, బెంగళూరుకు చెందిన ఎక్సిటన్ సంస్థ ఎండీ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమలకు, విద్యా సంస్థలను లింక్ చేసే విధానాలపై విస్తృతమైన చర్చ జరిగింది. రెండు రంగాల సంబంధాలను బలోపేతం చేసేందుకు, సాంకేతిక పురోగతిని సులభతరం చేయడానికి దోహదపడిందని విద్యాసంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. .

యువతి అదృశ్యం

బోరబండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ తుల్జారాం తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ వినాయకనగర్‌కు చెందిన యువతి డిసెంబర్ 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి వెంకటేశ్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తుల్జారాం తెలిపారు.

అనారోగ్యంతో మహిళ మృతి

బోరబండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మహిళ మృతిచెందిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్ఆర్ పురం సైట్-3కి చెందిన మోచి శోభ(54) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న ఆమె గురువారం సాయంత్రం మృతిచెందినట్లు సమీపంలోని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి ఆత్మహత్య

బోరబండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడికి గురై విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక నగర్‌కు చెందిన విద్యార్థి శ్రావణ్‌కుమార్(15) స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నాడు. మానసిక ఒత్తిడితోనే చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడి తండ్రి భూమయ్య గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

'సిలాయి' చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చేనేతకారులకు చేయూతనిచ్చేందుకు హస్తకళా ఆర్టీషియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో సిలాయి పేరుతో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ప్రారంభించిన ఫౌండేషన్ ఫౌండర్ శ్రీదేవి విజయదాస్ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో చేనేతకారులు నేసిన బెనారస్, హ్యాండ్‌పెయింటెడ్ టస్సార్, కంచి పట్టు, పెన్ కలంకారీ, జామధాని, మట్కా చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా చేనేతకారుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న శ్రీదేవి విజయదాస్

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన

యూసుఫ్‌గూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ గురించి భయపడాల్సిన అవసరం లేదని, కాస్త అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి పల్మనాలజిస్ట్ రత్నబాబు కొల్లాబత్తుల పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్ బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులకు ఈ వైరస్‌పై ఆయన అవగాహన కల్పించారు. హెచ్‌ఎంపీవీ ఊపిరితిత్తుల పైభాగంలో వస్తుందని, దీని ప్రభావంతో గొంతులో ఇబ్బంది, దగ్గు, జలుబుతో పాటు జ్వరం కూడా రావచ్చన్నారు. తీవ్రత ఎక్కువైతే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురై ఆయాసం వస్తుందన్నారు. కొందరిలో బ్రాంకైటీస్, న్యుమోనియా ఉంటాయని, చాలా వరకు ఇది సాధారణంగానే ఉంటుందన్నారు. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి, చిన్నపిల్లలకు సమస్య ఎక్కువ కావచ్చని, రెండు మూడు రోజులైనా తగ్గకుండా ఇబ్బంది పెడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కేటీఆర్ తీహార్ జైలుకు వెళ్లక తప్పదు

- ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ కాంతం

బంజారాహిల్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల సొమ్ము దోచుకున్న కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తీహార్ జైలుకు వెళ్లక తప్పదని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. బంజారాహిల్స్ లోని ఓ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ కుటుంబంపై ఆయన మండిపడ్డారు. కుటుంబ పాలనతో తెలంగాణను అన్ని విధాలుగా దోచుకున్నారని, ఎన్నికల కోడ్ ఉండగా క్యాబినెట్ ఆమోదం లేకుండా ఫార్ములా ఈ రేస్‌లో రూ.55 కోట్ల అవినీతి చేశారని ఆరోపించారు. అవినీతి కేసుల్లో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు జైలుకు వెళ్తున్నారని, అయినప్పటికీ సానుభూతి కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ముగిసిన తర్వాత తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసేందుకు సిద్ధమని కేటీఆర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, అప్పుడు కేటీఆర్ ఎందుకు చేయలేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో మరోసారి లబ్ధిపొందేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతిని ప్రజల ముందు ఉంచేందుకు ఈనెల 29న ఇందిరాపార్క్ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్ విద్యుత్ ప్రభా భవన్‌లో శుక్రవారం తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్- 2025 డైరీని టీజీ జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ ఈ.అనురాధ, టీజీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్, హెచ్‌ఆర్ డైరెక్టర్ కే.సుధామాధురి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతుల అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో సీఎండీలు పరిష్కరించారన్నారు. పదోన్నతులు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, టీజీట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

భారతీయ వస్త్రాలను ప్రోత్సహించడమే లక్ష్యం

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ వస్త్ర వైభవాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు ఫ్రాంటియర్ రాస్ క్రియేటివ్ డైరెక్టర్ గౌరంగ్ బాత్రా. శృంగర్ శృంఖలా పేరుతో బంజారాహిల్స్‌లోని తమ స్టోర్‌లో ఓ కార్యక్రమం నిర్వహించారు. చీర వైభవాన్ని తెలిపే రీతిలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఫిక్కీ లేడీస్ పూర్వ చైర్‌పర్సన్ పింకీ రెడ్డి, ఫ్యాషన్ డిజైనర్, బాలీవుడ్ నటుడు రిషీ కపూర్ కుమార్తె రిద్ధిమా కపూర్ సాహ్ని తదితరులు పాల్గొన్నారు.

అప్పు తిరిగివ్వమంటే హత్య చేశాడు

పంజాగుట్ట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగినందుకు స్నేహితుడినే గొంతుపిసికి చంపాడో పాత నేరస్థుడు. తాను తాకట్టు పెట్టిన కారును దొంగలించడానికి రాగా ఆ పాత నేరస్థుడిని పంజాగుట్ట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.91, 500 నగదు, బంగారు ఆభరణాలు, 5 సెల్ ఫోన్లు, కారు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రమేష్(32) హోటల్ రూమ్ సర్వీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. 2013లో ఓ వ్యక్తిని హత్య చేసి బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్, వాహనం దోచుకెళ్లాడు. అరెస్టై బెయిల్‌పై విడుదలైన తర్వాత నగరానికి వచ్చాడు. రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పని చేస్తున్నప్పుడు గ్రౌండ్ ఫ్లోర్‌లో కిరాణా షాప్ నడుపుతున్న ఎల్లారెడ్డిగూడకు చెందిన విష్ణురూపని(45)పరిచయం అయ్యాడు. రమేష్ తన కారును విష్ణు వద్ద తనఖా పెట్టి రూ.20 వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించక పోగా కారును తిరిగి ఇవ్వమని రూపాని కోరాడు. దీనికి విష్ణు నిరాకరించడంతో అమీర్‌పేటలోని తన గదికి పిలిచి హత్యకు పాల్పడ్డాడు. విష్ణు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు.

మార్చిలో 'ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ'

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ ఫిలిం మేకర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సహకారంతో మార్చి 23 నుంచి 26 వరకు నగరంలో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ (ఐ.ఎఫ్.ఎఫ్.టి)ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు దిలీప్ కుమార్, కె.భూపాల్, పి.రామచంద్రారెడ్డి తదితరులు ఫిలిం ఫెస్టివల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫెస్టివల్‌లో భాగంగా దేశ విదేశాలకు చెందిన చిత్రాలను ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు చిరంజీవిని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ చిత్రాలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఏఐలో వెయ్యి ఉద్యోగాల కల్పన

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో వెయ్యి ఉద్యోగాలను కల్పిస్తామని స్పిన్సై హెల్త్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ సంస్థ ప్రకటించింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపకుడు రజిత్‌కుమార్, సీఈఓ ఆండీ అసవా, డైరెక్టర్ కిరణ్ పోతరాజు, ఏపీ ఐటీ విభాగం మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జేఏ చౌదరిలతో కలిసి వివరాలు వెల్లడించారు. పేషంట్ ఎంగేజ్‌మెంట్, క్లినికల్ కొలాబరేషన్, పేషంట్ ఆర్థిక సేవలను ఏఐ ద్వారా అందిస్తామని సంస్థ వ్యవస్థాపకుడు రజిత్ కుమార్ తెలిపారు. విస్తరణలో భాగంగా ఏఐ రంగంలో తెలంగాణ రాష్ట్రంలో వెయ్యి ఉద్యోగాలను కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏడాదిన్నర చిన్నారికి అరుదైన సర్జరీ

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర చిన్నారికి స్టార్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ప్యాంక్రియాటిక్ సమస్యతో బాధపడుతున్న చిన్నారిని ఇటీవల నానాక్‌రాం గూడలోని స్టార్ ఆస్పత్రికి తల్లిదండ్రులకు తీసుకురాగా పరీక్షలు చేశారు.ప్యాంక్రియాటిక్ సమస్య కారణంగా పొట్టలో ద్రవం చేరినట్లు గుర్తించామని గ్యాస్ట్రో ఎంటారాలిజిస్టు డాక్టర్ మోకా ప్రణీత్ తెలిపారు. ఆ చిన్నారికి నవంబర్ 27న ఎండోస్కోపిక్ రెట్రోగేడ్ కోలాంజియో ప్యాంక్రియాటోగ్రఫి పద్ధతిలో సర్జరీ చేశామని చెప్పారు. కొద్ది రోజులుగా ఆమె ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షించామని, ఇప్పుడు పూర్తిగా కొలుకొని ఆరోగ్యంగా ఉందన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేశాడని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి ప్రేమ పేరుతో నమ్మించి తనను మోసం చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతికి ఫేస్‌బుక్ ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మూనూరి దుర్గా నాగవరప్రసాద్ పరిచయమయ్యాడు. రహ్మత్‌నగర్ నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో అతడు వేరే అమ్మాయిలతో మాట్లాడుతుండటంతో ఆమె ప్రశ్నించింది. అయితే ఆమె ఊరెళ్లి ఈ నెల 9న తిరిగి వచ్చే సరికి ఇంటికి తాళం వేసి ఉంది. ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో ప్రొటోకాల్ పాటించట్లేదు

- కాంగ్రెస్ నాయకులు

బంజారాహిల్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఈఓ శ్రీనివాసశర్మ స్థానిక ప్రజాప్రతినిధులు, రాజ్యసభ ఎంపీలకు, సీనియర్ నేతలకు కనీక సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని కాంగ్రెస్ నేతలు మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానికంగా ఉండే అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు దేవాలయ అభివృద్ధిపై, ముఖ్య దినాల్లో నిర్వహించే కార్యక్రమాలపై సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. పర్వదినాల్లో భక్తులకు మౌలికవసతుల కల్పనలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. కనీసం వైకుంఠ ఏకాదశి పర్వదినాన సైతం అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదన్నారు. దీనిపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శరత్ గౌడ్, చిన్నా ముదిరాజ్, రాము, సురేష్, హరి, వేణు పాల్గొన్నారు.


ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్ షష్టిపూర్తి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్ తదితరులు

- ఎర్రగడ్డ, జనవరి 10, ఆంధ్రజ్యోతి




నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి అలంకరణలో యువతులు



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వివిధ వేషధారణలతో యువతులు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు

- ఉత్తరద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సర్దార్ పటేల్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



బౌద్ధనగర్ సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ మాజీ కార్పొరేటర్ కందినారాయణ, తదితరులు

బౌద్ధనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పోటెత్తింది. ఆలయ చైర్మన్ నేముల ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో మాజీ మంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి కార్పొరేటర్లు సామల హేమ, కందిశైలజ, ముఖ్య నేతలు మేకల సారంగపాణి, బండ చంద్రారెడ్డి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కుంచాల ఏడుకొండలు, సాయికుమార్, బిట్ల రఘునందన్, రాచమల్ల కృష్ణమూర్తి, తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, సాదం బాలరాజుయాదవ్, టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని లాల్‌బజార్‌లోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని ఉపదేవాలయమైన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం వైకుంట ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం కనులపండువగా సాగింది. స్వామి వారికి ఉదయం 5:30 గంటలకు వైకుంఠ ద్వార పూజ 6 గంటలకు అభిషేకం, వస్త్ర అలంకరణ సేవ, అర్చన, హారతి లాంటి ప్రత్యేక పూజలు జరిగాయి.

రాంగోపాల్‌పేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జనరల్ బజార్‌లో గల 110 సంవత్సరాల చారిత్ర కలిగి పూర్తిగా వానమామలై సంప్రదాయం ప్రకారం నిత్య పూజలు, కైంకర్యాలు నిర్వహించే శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారు జామునుండే ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. సికింద్రాబాద్ నుంచే కాక వివిధ ప్రాంతాలను నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు ఆలయానికి పోటెత్తారు.

రాంగోపాల్‌పేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పాన్‌బజార్‌లోగల వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వేణుగోపాల స్వామికి మూల మంత్రంలో హోమ పూజ, క్షీరాభిషేకం, సహస్ర పుష్పాలతో పూజలు నిర్వహించారు.

బోయిన్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలో తిరుమలలాగా విరాజిల్లుతున్న బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రత్యేక అభిషేక అర్చనలు జరిగాయి. స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.



వేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



శ్రీనివాస్‌నగర్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ, తదితరులు



పాండురంగ స్వామి, ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేట్ కొంతం దీపిక, బీజేపీ నాయకులు



వేంకటేశ్వరస్వామికి పూజలు చేసిన బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి



శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి



వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న మాజీమేయర్ బండ కార్తీకరెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు



ఎస్పీ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షురాలు సౌందర్య

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

- అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు సౌందర్య

అడ్డగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని నూతనంగా నియమితులైన అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య అన్నారు. శుక్రవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేవంలో మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేస్తామని తోటి కార్యకర్తలతో మమ్మైకమ్మై పార్టీ కార్యాక్రమాల్లో పాల్గొంటామన్నారు. అడ్డగుట్ట డివిజన్‌లో చాలా సమస్యలు ఉన్నాయని ఏ పార్టీ నాయకులు పట్టించుకోలేదని ఇప్పటి నుంచి ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలపై ఫోకస్ పెడుతామన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. తనకు ఈ పదవి కేటాయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుదర్‌గౌడ్‌లకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో బీజేపీ సినియర్ నాయకులు హంసరాజు, ఎల్లంకి వీరేశం, ఉదయ్‌యాదవ్, శివాజీ, శ్రావణ్, చిరంజీవి, విజయ్, దుర్గాబాయి, లక్ష్మిలు పాల్గొన్నారు.



మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌ను కలిసిన బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్

బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడిగా సాయిప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడిగా వారసిగూడకు చెందిన పి.సాయిప్రసాద్‌గౌడ్ నియామితులయ్యారు. శుక్రవారం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌ను సాయిప్రసాద్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మాట్లాడుతూ బౌద్ధనగర్ డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేస్తామని తెలిపారు. యువకులను కలుపుకుని బీజేపీ పటిష్టతను పెంచుతామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడి సమస్యలను పరిష్కారించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తన తండ్రి ప్రసుత్త రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ రెండుసార్లు డివిజన్ అధ్యక్షుడిగా పనిచేశారని, తనతల్లి స్వరూపగౌడ్ కార్పొరేటర్‌గా చేశారని తెలిపారు. తనను డివిజన్ అధ్యక్షుడిగా నియామించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తార్నాక డివిజన్ అధ్యక్షుడిగా ఉపేందర్ యాదవ్

తార్నాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ తార్నాక డివిజన్ అధ్యక్షుడిగా లాలాపేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు బండారి ఉపేందర్ యాదవ్ నియామితులయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా సంస్థాగత ఇన్‌చార్జి కాంతారావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ తార్నాక డివిజన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు పార్టీ ఆధినాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తార్నాక డివిజన్‌లోని బీజేపీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ బలోపేతానికై కృషి చేస్తానని తెలిపారు.

రద్దీకి అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలి

- నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్

అడ్డగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజుల్లో సంక్రాంతి పండుగ రావడంతో రైలు ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని ఎవరికి ఇబ్బందులు కలగకుండా సికింద్రాబాద్ జీఆర్పీ, ఆర్పీఎఫ్, గోపాలపురం ట్రాఫిక్, పోలీసులు జాగ్రతగా వహించాలని నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాళ్ సూచించారు. శుక్రవారం డీసీపీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను పర్యవేక్షించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో క్రమ పద్ధతిలో ప్రయాణికులు జాగ్రత్త రైలు ఎక్కించే విధంగా రద్దీ లేకుండా చూడాలన్నారు. రైలు రాగానే గుంపులు గుంపులుగా ఎక్కడ మహిళలు వృద్ధులు దివ్యాంగుల రైలు ఎక్కలేని పరిస్థితిలో కింద పడిపోవడం జరుగుతుందని అందుకే ముందస్తు జాగ్రత్తగా ఈ నాలుగు రోజులు పకడ్బందీగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా విధులు నిర్వహించాలన్నారు. రైల్వేస్టేషన్ సాయంత్రం వేళలో రైలు కోసం వచ్చే ప్రయాణికులు క్యాబ్‌లో వస్తుంటారు కానీ రైల్వే స్టేషన్ బయట ట్రాఫిక్ ఇబ్బంది ఉంటుందని, అందుకు సమయానికి ప్రయాణికులు వెళ్లాల్సిన రైలు ఎక్కలేకపోతున్నారు. స్టేషన్ దగ్గర ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసులకు సూచనలిచ్చారు. డీసీపీ వెంట సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్, గోపాలపురం సీఐ నరేష్, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు, ఎస్సై సతీష్ ఉన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో పర్యవేక్షిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమళ్

గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమ మద్యం

- 49 బాటిళ్లు పట్టివేత

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి వాస్కోడిగామా రైల్లో హైదరాబాద్ నగరానికి అక్రమంగా దిగుమతి అవుతున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 49 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... వాస్కోడిగామా రైల్లో గోవా నుంచి మద్యం సరఫరా అవుతున్నట్లు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) విశ్వసనీయ సమచారం అందింది. దాంతో శంషాబాద్‌లో రైల్లోకి ఎక్కిన పోలీసులు సికింద్రాబాద్ వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 49 గోవా మద్యం బాటిళ్ల లభించాయి. అయితే అప్పటికే నిందితులు తప్పించుకోవడంతో వాటిని ఎవరు తెస్తున్నారనేది తెలియలేదు. అక్రమ మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్)ను పట్టుకున్న ఏఈఎస్ జీవన్‌కుమార్, సీఐ బాలరాజు, చంద్రశేఖర్, ఎస్సైలు రవి, వెంకటేష్, అఖిల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



తిరుమలగిరి ఆర్‌టీఓ కార్యాలయంలో వైద్య శిబిరం

పండుగ వేళ.. సురక్షితంగా వెళ్లి రండి

- రవాణా శాఖ అధికారుల అవగాహన

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా వారోత్సవాలపై రవాణా శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పండుగల వేళ దూర ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులకు సురక్షిత రాకపోకల కోసం నిబంధనలు పాటించాలని సూచిస్తోంది. ఇప్పటికే రహదారులపై హెల్మెట్లు పంచి, గులాబీ పూలు అందజేసి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. శుక్రవారం తిరుమలగిరి ఆర్‌టీఓ కార్యాలయ ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యాలయంలో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చిన పౌరులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఆర్‌టీఓ యెర్రిస్వామి, అధికారులు జైచందర్, అవినాష్, నరసింహస్వామి, ఆటో యూనియన్ నాయకుడు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న మహిళలు

ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కేఎం క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న సుమారు 350 మందికి షుగర్, బీపీ, ఫీవర్ తదితర వైద్య పరీక్షలతో పాటు వెరికోస్‌వెయిన్, లెగ్ స్వెల్లింగ్(కాళ్లవాపులు) కాలువెనుక కండరాలలో నొప్పి, తిమ్మిర్లు నాన్‌హీలింగ్ అల్సర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.



ముఖ్య అతిథి శిఖా వైష్ణోమ్‌కి జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

రైల్వేలో ముగ్గుల పోటీలు

చిలకలగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ భవన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని అందమైన రంగవలుల్లు తీర్చిదిద్దారు. ముఖ్య అతిథులుగా డివిజనల్ మేనేజర్ హైదరాబాద్ లోకేష్ వైష్ణోయ్, ద.మ. రైల్వే మహిళ, శిశు సంక్షేమ సంఘ అధ్యక్షురాలు శిఖా వైష్ణోయ్‌లు విచ్చేసి మాట్లాడుతూ పోటీలలో పాల్గొంటే దాగివున్న ప్రతిభ బయటకు వస్తుందని, వత్తిడి దూరం కావడానికి మహిళలు ఇటువంటి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్‌సంఘ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పోషక విలువలపై అవగాహన

రెజిమెంటల్‌బజార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆహార పదార్థాలలో ఉండే పోషక విలువలపై అవగాహన కల్పించడానికి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మమత హై స్కూల్ కరస్పాండెంట్ ఇందిరా రాణి అన్నారు. శుక్రవారం రసూల్‌పురలోని మమత స్కూల్‌లో ఆహార పదార్థాలలో ఉండే ప్రోటీన్స్, విటమిన్‌లు, కార్బోహైడ్రేట్‌లు, ఫైబర్‌లపై అవగాహన కల్పించడానికి విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసి తీసుకొచ్చిన పదార్థాలతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ గుండప్ప, నోడల్ ఆఫీసర్ యాదగిరి, విమన్‌నగర్ వేల్ఫేర్ అసోషియేషన్ ప్రెసిడెంట్ రాజేషం తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద ట్రైన్ కోసం వేచివున్న ప్రయాణికులు



సంక్రాంతి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో జేబీఎస్ బస్ స్టేషన్ నుంచి సొంత ఊర్లకు వెళ్తున్న ప్రయాణికులు

